జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
గురువారం | 24 | అక్టోబర్ | 2024 ◆ పేజీలు : 7

## విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా రంగాల్లో రాణించాలి

–జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాజ్యోతి కరీంనగర్ బ్యూరో:**
బుధవారం కరీంనగర్ రీజనల్ స్పోర్ట్స్ స్కూల్లో గ్రంథాలయం ప్రారంభించిన అనంతరం విద్యార్థులు బూట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు.ప్రస్తుత సమాజంలో క్రీడాకారులకు కొరత ఉందని. చదువుతోపాటు

మిగతా 2లో...

## పటిష్టంగా గ్రామ పరిపాలన

- గ్రామాలలో అనుమతి లేని నిర్మాణాలు జరగకుండ చూడాలి
- అక్టోబర్ నెలాఖరు నాటికి 80 శాతం పన్ను వసూలు పూర్తి చేయాలి
- 3వేల పైచిలుకు జనాభా గల 17 గ్రామ పంచాయతీల పాలన పై రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**రామగిరి, అక్టోబర్ 23 (ప్రజాజ్యోతి ):**
జిల్లాలోని గ్రామాలలో పరిపాలన పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ.శ్రీహర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ.శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రామగుండం, మంథని అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 3వేల పైచిలుకు జనాభా గల 17 గ్రామ పంచాయతీల పాలన పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ.శ్రీహర్ష మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో అందుబాటులో ఉన్న నిధుల నుంచి పెండింగ్ బకాయిలు పూర్తి స్థాయిలో చెల్లించాలని, బకాయిల చెల్లింపు, తరువాత ఉన్న నిధులు వినియోగిస్తూ గ్రామాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు గుర్తించి ప్రత్యేక అధికారుల ద్వారా మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ నిరంతరాయంగా కొనసాగాలని, ప్రతి రోజు ఇంటి నుంచి చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్ తరలింపు, సెగ్రిగేషన్ షెడ్ వినియోగం పక్కాగా జరగాలని అన్నారు.గ్రామాలలో ఎటువంటి సమస్య ఎదురైన వెంటనే తన దృష్టికి

మిగతా 2లో...

## రక్తదానం చేసిన పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి



**కరీంనగర్ క్రైం, అక్టోబర్ 23,ప్రజాజ్యోతి**
పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా కరీంనగర్ పోలీసు కమీషనరేట్ కేంద్రంలోని పరేడ్ గ్రౌండులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బుధవారం పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి ప్రారంభించి అనంతరం రక్తదానం చేశారు,ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలను కోల్పోయిన పోలీసు అమరవీరులను స్మరిస్తూ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.కమీషనరేట్ లోని అన్ని విభాగాలకు చెందిన పోలీసు అధికారులతో పాటు కమీషనరేట్ శిక్షణ కేంద్రంలోని శిక్షణ కానిస్టేబుళ్లు సైతం ఇందులో పాల్గొన్నారన్నారు.సుమారు 200 మంది రక్తదానం చేసారని తెలిపారు. సేకరించిన ఈ రక్తాన్ని కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి అందిస్తున్నామన్నారు.పోలీసులతో పాటు ప్రజలు కూడా వచ్చి స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (శాంతి భద్రతలు) ఎ. లక్ష్మీనారాయణ , అడిషనల్ డీసీపీ (ఏ ఆర్) అనోక్ జయ్ కుమార్ లతో పాటు ఏసీపీలు విజయ్ కుమార్ , మాధవి , నరేందర్ , వెంకటరమణ, కమిషనరేట్ లోని ఇన్స్పెక్టర్లు కోటేశ్వర్ , విజయకుమార్, జాన్ రెడ్డి, స్వామి , ప్రకాష్ గౌడ్ , రిజర్వు ఇన్స్పెక్టర్లు రజినీకాంత్, కుమార స్వామి, జానీమియా , శ్రీధర్ రెడ్డి, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## హత్య కేసును చేధించిన పోలీసులు

- ముగ్గురు కలిసే పల్లపు సాయిలిని హత్య చేశారు.
- పాత కక్షలే హత్యకు కారణాలు
- నాలుగు ఇంచుల గోడ గొడవే హత్యకు కారణమైంది
- తోడబుట్టిన అన్నదమ్ములే హత్య చేశారు




**మల్లాపూర్ అక్టోబర్ 23, ప్రజాజ్యోతి:**
మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో జరిగిన హత్య కేసుని పోలీసులు చేదించారు. దానికి సంబంధించిన వివరాలు డిఎస్పి ఉమామహేశ్వరరావు బుధవారం వెల్లడించారు. మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో ఈ నెల 20న జరిగిన పల్లపు సాయిలు(36) అనే వ్యక్తిని హత్య చేసిన నిందితులను పట్టుకున్నట్లు మెట్ పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు డీఎస్పీ కార్యాలయంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...మృతుని తమ్ముళ్లయిన పల్లపు చందు,పల్లపు చిన్ని, గొల్ల సోమయ్య అనే వారితో మృతుడు పల్లెపు సాయిలుకు గత కొద్ది రోజులుగా భూ ఆస్థి వివాదం,ఇంటి స్థలంలో

మిగతా 2లో...

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చిగుర్ల శ్రీనివాస్ నియామకం

**కరీంనగర్ బ్యూరో, ప్రజాజ్యోతి**
బీసీ భవన్ లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చిగుర్ల శ్రీనివాస్ నియమితులు అయ్యారు బుధవారం హైదరాబాద్ విద్యానగర్లో బీసీ భవన్ లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య చిగుర్ల శ్రీనివాస్ ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. పార్లమెంట్లో 50% బీసీ బిల్లును చట్టసభల్లో ప్రవేశ పెట్టడం కొరకై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన కరీంనగర్ జిల్లాకు చెందిన చిగుర్ల శ్రీనివాస్ కు ఆర్ కృష్ణయ్య సూచించారు.ఈ సందర్భంగా చిగుర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ నపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎక్స ఎంపీ ఆర్ కృష్ణయ్య కు, బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ కు, నాయకులకు జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.



# విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా రంగాల్లో రాణించాలి



(మొదటి పేజీ తరువాయి...)

ఆటల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు, గౌరవం, ఉన్నత ఉద్యోగాలు దక్కుతాయన్నారు.కష్టాన్ని నమ్ముకుని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. క్రీడా పాఠశాల విద్యార్థులకు ప్రతివారం తప్పనిసరిగా ఒక సందేశంత్మక సినిమా చూపించాలని అధికారులకు సూచించారు.త్వరలో క్రీడా పరికరాలు,దుస్తులు అందిస్తామన్నారు.అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ. తక్కువ సమయంలో సమాజంలో గౌరవం సంపాదించాలంటే క్రీడలను ఎంచుకోవడమే మార్గం అన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ రాంబాబు, పాఠశాల హెచ్ఎం లీలా ప్రసాద్ విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసును చేధించిన పోలీసులు

(మొదటి పేజీ తరువాయి...)

కొన్ని సంవత్సరాల నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒకరినొకరు కొట్టుకొని మల్లాపూర్ పోలీస్ స్టేషన్ లో కేసులు కూడా నమోదు అయ్యాయని తెలిపారు. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ కూడా పెట్టారు.ఐనా కక్ష పెంచుకొని మృతుడు పల్లపు సాయిలు ఒంటరిగా ఉన్న సమయాన్ని చూసిన దానవేణి(గొల్ల)సోమయ్య, చందు,చిన్ని స్థానిక గోదావరి బ్రిడ్జి వద్దకు ద్విచక్ర వాహనంపై చేరుకున్నారు. అనంతరం గొడవపడి సాయిలుని నెట్టివేయగా కింద పడిపోయాడు. దాంతో వారి వెంట తెచ్చుకున్న కత్తితో నరకడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుని భార్య నవ్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం మల్లాపూర్ శివారులోని కనకసోమేశ్వర గుడి వద్ద ఉన్నారనే సమాచారంతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, హత్యకు ఉపయోగించిన తల్వార్ (కత్తి) స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో సీఐ నిరంజన్ రెడ్డి, మెట్ పల్లి ఎస్ఐలు చిరంజీవి, రాజు, మల్లాపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పటిష్టంగా గ్రామ పరిపాలన



(మొదటి పేజీ తరువాయి...)

తీసుకుని రావాలని అన్నారు.గ్రామాలలో ఎక్కడా అనుమతులు లేని నిర్మాణాలు జరగడానికి వీలు లేదని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో ఎక్కడైనా 3వ విద్యుత్ వైర్లు ఉన్న పక్షంలో వివరాలను అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సి. ఎస్.ఆర్ .క్రింద బసంత్ నగర్ గ్రామంలో కేశోరాం సిమెంట్, పన్నూరు గ్రామంలో సింగరేణి సంస్థ వీధి దీపాలు, పారిశుధ్య బాధ్యత తీసుకునేలా గ్రామ పంచాయతీ అధికారి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ నెలాఖరు నాటికి గ్రామాలలో 80 శాతం పన్ను వసూలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, డి.ఎల్.పి.ఓ .లు, ఎం.పి.డి.ఓ.లు, ఎం.పి.ఓ.లు, పంచాయతీ సెక్రటరీలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచిన దినసరి కూలి

**కరీంనగర్ క్రైం, అక్టోబర్ 23,ప్రజాజ్యోతి,**



పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా కరీంనగర్ పోలీసు కమీషనరేట్ కేంద్రంలోని పరేడ్ గ్రౌండులో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామానికి చెందిన దినసరి కూలి కోతి శ్రీనివాస్ (27) పాల్గొని రక్తదానం చేసారు.చేపలు పట్టుకోవడం,దినసరి కూలిగా పని చేస్తున్న శ్రీనివాస్ తన భార్య(24) ఇద్దరు పిల్లలు అయిన కొడుకు ప్రియాన్స్ (5), కూతురు ఆద్య (1) లతో సహా కుటుంబ సమేతంగా గన్నేరువరం నుండి కరీంనగర్ పోలీసు కమిషనరేట్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి చేరుకొని స్వచ్ఛందంగా రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు.విషయం తెలుసుకున్న కరీంనగర్ పోలీసు కమీషనర్ అభిషేక్ మొహంతి వారిని తన కార్యాలయానికి పిలిపించి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపి అభినందించారు.పోలీసు కమీషనర్ వెంట రిజర్వు ఇన్స్పెక్టర్ సంక్షేమం శ్రీధర్ రెడ్డి వున్నారు.

# అశ్రునయనాల మధ్య గంగుల మాతృమూర్తి అంతిమయాత్ర



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 23,ప్రజాజ్యోతి,**

మాజీమంత్రి,కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాతృమూర్తి గంగుల లక్ష్మీనర్సమ్మ అంత్యక్రియలు బుధవారం అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర నిర్వహించారు.క్రిస్టియన్ కాలనీలోని నివాసం నుంచి సప్తగిరి కాలనీలోని స్వర్గధామం వరకు జరిగిన అంతిమయాత్రకు భారీ సంఖ్యలో రాజకీయ నాయకులు,బంధువులు తరలి వచ్చారు. లక్ష్మీనర్సమ్మకు కడసారి వీడ్కోలు పలికేందుకు మాజీ మంత్రులు హరీశ్ రావు, ప్రశాంత్ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్,ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి,మేడిపల్లి సత్యం మాజీ ఎమ్మెల్సీ నారదాసు,మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్,వాటర్ రిసోర్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వి ప్రకాష్ రాకేష్ రెడ్డి,గెల్లు శ్రీనివాస్ యాదవ్,మేయర్ సునీల్ రావు,మాజీ సివిల్ సప్లై కార్పోరేషన్ చైర్మెన్ రవిందర్ సింగ్, జిల్లా కలెక్టర్ పమెలా సత్పతి, మున్సిపల్ కమీషనర్ చాహత్ బాజ్ పాయ్, సూడా చైర్మెన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా బి. ఆర్. ఎస్. పార్టీ అధ్యక్షులు జి. వి. రామకృష్ణ ,పలువురు కార్పొరేటర్లు,ప్రజాప్రతినిధులు,మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి,అడషనల్ కలెక్టర్లు ,ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్ లు ,ఆర్. డి. ఓ. ఉమా మహేశ్వర్, టి ఎన్. జి. ఓ నాయకులు,అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మెన్ నరేందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ టి యు మండల అధ్యక్షుడిగా మహమ్మద్ రజాక్

**జమ్మికుంట, అక్టోబర్23,ప్రజాజ్యోతి:**





జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో గల ధర్మారం పాఠశాలలో బుధవారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జమ్మికుంట మండల శాఖ సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశంలో జమ్మికుంట మండలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు..ఎస్టియు జమ్మికుంట మండల శాఖ అధ్యక్షుడు యం డి రజాక్ పాషా ప్రధాన కార్యదర్శిగా మేడుదుల నాగరాజు, ఆర్థిక కార్యదర్శిగా కుర్ర సమ్మయ్య ,అసోసియేట్ అధ్యక్షుడు దేవునూరి రఘు,కార్యదర్శులుగా కే మహేందర్, విఐ యం శ్రీనివాస్, బి రాజు, జిల్లా కౌన్సిలర్ పురుషోత్తమూర్తి ఎస్ రాజమౌళి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు..ఎన్నికల పరిశీలకులుగా కోట శ్యాం కుమార్ వ్యవహరించినారు..వీరి నియామకం సహకరించిన జిల్లా అధ్యక్షులు పిఆర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కట్ట రవీంద్ర చారి లకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపారు.

# చిగురుమామిడిలో ఉచిత చేప పిల్లల పంపిణీ

★ మత్స్యకారుల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం..

★ ఎఫ్ డిఓ ఇంచార్జ్ మంజుల..

**చిగురుమామిడి అక్టోబర్ 23 (ప్రజాజ్యోతి)**





మత్స్యకారుల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తుందని ఎఫ్ డి ఓ ఇంచార్జ్ మంజుల తెలిపారు. బుధవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో ప్రభుత్వం 100% సబ్సిడీపై అందజేస్తున్న 35-40 ఎం ఎం చేప పిల్లలను మత్స్య సహకార సంఘాలకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ఎంపిడిఓ కాజా మొయినుద్దీన్,వ్యవసాయ శాఖ అధికారిని రమ్యశ్రీ, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ జక్కుల బాబు,ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పెసరి రాజేశంలు హాజరై సంఘాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ డి ఓ ఇన్చార్జి మంజుల మాట్లాడుతూ చిగురుమామిడి మండలంలోని తొమ్మిది సంఘాలకు గాను దాదాపు 5లక్షల 80వేల చేప పిల్లలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.సిజినల్ ట్యాంకులకు సంబంధించి ఈ చేప పిల్లలను ప్రభుత్వం ఉచితంగా అందజేసినట్లు చెప్పారు.సంఘాలకు ఉచిత చేపలను పంపిణీ చేసినందుకుగాను రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు మచ్చ కార్లు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు గుళ్ల బాలయ్య,చెరుకు సంజీవ్, సభ్యులు గుళ్ళ వెంకటేశం,పిల్లి కొమురయ్య,పిల్లి శ్రీనివాస్,గూళ్ళ బాలయ్య,పిల్లి రమేష్,హనుమల్ల సురేష్,తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులకు కనీస మద్దతు ధర కల్పించేందుకు

# సిసిఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు





### వి. పద్మావతి, ప్రాంతీయ ఉప మార్కెటింగ్ సంచాలకులు, వరంగల్

**జమ్మికుంట, అక్టోబర్ 23, ప్రజా జ్యోతి**

పత్తి రైతులకు కనీస మద్దతు ధర కల్పించేందుకు జమ్మికుంట పత్తి మార్కెట్లో సిసిఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు వరంగల్ ప్రాంతీయ ఉప మార్కెటింగ్ సంచాలకులు వి. పద్మావతి అన్నారు. జమ్మికుంట పత్తి మార్కెట్లో బుధవారం సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతుల నుండి ప్రభుత్వ మద్దతు ధరలపై పత్తి కొనుగోలు చేయుటకుగాను జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటి పరిధిలో పత్తి మార్కెట్ యార్డునందు మరియు మార్కెట్ కమిటి పరిధిలోని (7) జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేయడం జరిగిందన్నారు. రైతులు సి.సి.ఐ. కి పత్తి అమ్ముకునే సమయంలో తప్పనిసరిగా నాణ్యమైన పత్తిని మార్కెట్ యార్డుకి తీసుకొని వచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7,521/-లు పొందాలన్నారు. తేమ శాతము 8% నుండి 12% మధ్యలో ఉన్న పత్తిని మాత్రమే సి.సి.ఐ. కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. 12% మించిన పత్తిని సి.సి.ఐ. కొనుగోలు చేయదని తెలిపారు. నీళ్ళు చల్లిన, రంగు మారిన పత్తిని కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేయరని అన్నారు. రైతు గుర్తింపు కొరకు ఆధార్ కార్డు (జిరాక్స్ కాపి), పట్టాదారు పాసు పుస్తకము కొత్తది (కొత్తది మంజూరి కాని యెడల పాత పుస్తకము) జిరాక్స్ కాపి వెంట తీసుకురావాలన్నారు. కె.వై.సి. చేయబడిన బ్యాంకు ఖాతా పుస్తకము లోని మొదటి రెండు పేజీలు, పేరు, ఫోటో, ఖాతా నెంబరు, ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ ఇతర వివరములు ఉండే విధముగా జిరాక్స్ కాపీ తప్పకుండా తీసుకురావాల్సి ఉంటుంది అన్నారు. పత్తి అమ్ముకునే సమయములో ఆధార్ ప్రమాణికము చేయవలసి ఉన్నందున, బయోమెట్రిక్ వేలిముద్ర, ఫోటో తీసుకోవలసి ఉంటుందని తెలిపారు. పత్తి పంట కొనుగోలు ప్రక్రియ ముగిసిన తదుపరి, ఆధార్ అనుసంధానం చేయబడిన బ్యాంకు ఖాతాకు మాత్రమే సి.సి.ఐ. వారు డబ్బులు జమ చేయుదురు. అలా ఆధార్ బ్యాంకు ఖాతా అనుసంధానం కానిచో డబ్బులు జమ చేయడం జరగదు అన్నారు. రైతులు తమ పత్తిని గ్రామాలలోని దళారులకు, మధ్యవర్తులకు తక్కువ ధరలకు అమ్ముకొని ఆర్థికంగా నష్టపోవద్దని, నాణ్యమైన పత్తిని మార్కెట్ యార్డునకు తీసుకవచ్చి ప్రభుత్వ మద్దతు ధరలు పొందాలన్నారు. ఈ కార్యాక్రమంలో డి.ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారి, రమేశ్ బాబు రెవిన్యూ డివిజినల్ అధికారి హుజూరాబాద్, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి మల్లేశం జమ్మికుంట, కాటన్ జిన్నింగ్ మిల్లర్లు, అడిదారులు, రైతులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ మెజారిటీతో గెలిపించండి ఎమ్మెల్సీ పదవికి వన్నెతెస్తా

### తన విద్యసంస్థల్లో చాలా మంది నిరుపేద విద్యార్థులకు ఫీజులో రాయితీ కల్పించా..

### పెండింగ్ డీ ఏల విడుదల సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా...

### ఉద్యోగులకు నగదు రహిత హెల్త్ స్కీమ్ అమలుకు కృషి

### పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో, ప్రజాజ్యోతి**

రాష్ట్రంలో ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న డీఏలను విడుదల చేసే విధంగా ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని కరీంనగర్ –ఆదిలాబాద్ –నిజామాబాద్ –మెదక్ ప ట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో పలువురు పట్టభద్రులు, ఎలక్ట్రిసిటీ ఇంజనీర్లు , చార్టెడ్ అకౌంట్ ప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు పలకాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తనను సంపూర్ణ మద్దతు ఇచ్చి భారీ మెజారిటీ తో ఎమ్మెల్సీ గా గెలిపిస్తే ఎమ్మెల్సీ పదవికి ఇవన్నీ తీస్తానని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న నిరుద్యోగ సమస్యను నిర్మూలించి పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. రాష్ట్రంలో డిగ్రీ, పీజీ ప్రైవేటు కళాశాలల ఫీజు రీయింబర్స్మెంటు, విద్యార్థుల స్కాలర్ షిప్ బకాయిలు విడుదల కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. రాష్ట్రంలో ఎన్నో ఏండ్లుగా పెండింగ్ లో ఉన్న ఐదు డీఏలను చెల్లించేలా ప్రభుత్వంతో మాట్లాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. ఈ నెల 26న జరిగే క్యాబినెట్ సమావేశంలో సరైన నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. 317 జివో తో రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి వచ్చినట్టు వెల్లడించారు. ఆ సమస్య ను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుకు కృషి చేస్తానన్నారు. నగదు రహిత హెల్త్ స్కీంను అమలు చేసి ఉద్యోగులు పడే ఇబ్బందులు పునరావృతం కాకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్ కో డిపార్ట్మెంట్ లో ఏఈ ల కొరత తీవ్రంగా ఉందని వాటి భర్తీకి కృషి చేస్తానని అన్నారు. గతంలో పట్టభద్రుల ఓట్లతో గెలిచిన వారందరూ రాజకీయాలకే పరిమితమయ్యారని. నిరుద్యోగ యువత, పట్టభద్రుల సమస్యలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిస్వార్ధంగా సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానని తాను 34 ఏండ్లుగా విద్యారంగంలో క్రమశిక్షణ విలువలతో కూడిన విద్యను అందించి వేల మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చానని వెల్లడించారు. తన విద్యాసంస్థలలో చాలా మంది నిరువిద్యార్థులకు ఫీజులో రాయితీ కల్పించి ఉచిత విద్యతో పాటు. వసతులు కూడా కల్పించానని. ప్రస్తుతం తాను చేసిన మంచి పనుల డాటా తన వద్ద లేదని భవిష్యత్తులో కూడా తన దృష్టికి వచ్చిన నిరుపేద విద్యార్థులకు ఫీజులో రాయితీ కల్పిస్తానని వెల్లడించారు.





## గంగులను పరామర్శించిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, ప్రజాజ్యోతి**

కరీంనగర్ ఎమ్మెల్యే మాజీ మంత్రి గంగుల కమలాకర్ ను పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి పరామర్శించారు. గంగుల మాతృమూర్తి లక్ష్మీ నరసమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం కరీంనగర్ లోని గంగుల నివాసంలో వారి కుటుంబ సభ్యులను కలసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. లక్ష్మీ నర్సమ్మ పార్థివ దేహం పై పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

## విధి నిర్వహణలో నైతికవిలువలు కీలకం

**కరీంనగర్ బ్యూరో, ప్రజాజ్యోతి**



బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఐసిఎఐ కరీంనగర్ విభాగం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన "ప్రొఫెషనల్ కోర్ట్ ఆఫ్ ఎథిక్స్" అవగాహన సదస్సుకు విశిష్ట అతిథిగా కరీంనగర్ – ఆదిలాబాద్ – నిజామాబాద్ – మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా




ఆయన మాట్లాడుతూ నవంబర్ 6 లోపు ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకుని రానున్న పట్టభద్రులు ఎన్నికల్లో తనకు మద్దతు తెలుపాలని కోరారు.

## పెండింగ్ డీ ఏ లు వెంటనే విడుదల చేయాలి. డిటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు సార్ల సంపత్

**ఇల్లందకుంట, అక్టోబర్23, ప్రజాజ్యోతి**



ప్రభుత్వ ఉద్యోగులందరికి పెండింగ్ లో ఉన్న మూడు డీ ఏ లను తక్షణమే చెల్లించాలని ఎన్నికల లో ఇచ్చిన హామీ మేరకు 3 రోజుల్లో జరిగే క్యాబినెట్ సమావేశంలో దీపావళి కానుకగా మూడు డీ ఏ లను ప్రకటించాలని డిటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు సార్ల సంపత్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.. ధరల పెరుగుదల ప్రకారం 51 శాతం ఫిట్ మెంట్ తో పీఆర్ సీ నివేదికను తెప్పించుకొని అమలుకు చర్యలు వేగవంతం చేయాలని అన్నారు.. పెండింగులో ఉన్న మెడికల్, సరెండర్, జీ పీఎఫ్ పార్ట్ ఫైనల్ బిల్లులను వెంటనే చెల్లించాలి. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీ పీ ఎస్ ను రద్దు చేసి ఓ పీ ఎస్ ను అమలు చేయాలని, 317 జీ ఓ బాధితుల సమస్యను పరిష్కరించాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని ఈ ఎచ్ ఎస్ అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## డిమాండ్స్ డే విజయవంతం



*హుజురాబాద్, అక్టోబర్23, ప్రజాజ్యోతి*

జాయింట్ కౌన్సిల్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ కేంద్ర సంఘాల పిలుపుమేరకు అక్టోబర్ 23, 24, 25 తేదీల్లో మూడు రోజులపాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని తపాలా కార్యాలయాల ముందు డిమాండ్స్ డే ను నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఉకంటి మహేందర్ తెలిపారు.. ఈ సందర్భంగా ప్రధాన తపాల కార్యాలయం ఎదుట పోస్టల్ ఉద్యోగులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి డిమాండ్స్ డే సందర్భంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన ఉద్యోగులను ఉద్దేశించి మహేందర్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి యూనిఫైడ్ నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, వెంటనే ఎనిమిదవ వేతన కమిటీని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏర్పాటు చేయాలని, 2023 పోస్ట్ ఆఫీస్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని,ఎన్ ఎఫ్ పి ఈ ఏ ఐ పి ఈ యూ గ్రూప్ –సి సంఘాలకు రాంచీ హైకోర్టు ద్వారా తేదీ 12–04–2024 రోజున ఇచ్చిన కోర్టు తీర్పు ను అమలు పరిచి, సంఘాలకు పూర్వ పద్ధతిలో గుర్తింపును కొనసాగించాలని డిమాండ్ చేశారు... ఈ కార్యక్రమంలో గ్రూప్ సి నాయకులు పి అమర్నాథరెడ్డి, సిహెచ్ ప్రవీణ్, ఏ సందీప్, ఎస్ వేణుగోపాల్, ఎం శ్రీనివాస్,గ్రూప్ డి నాయకులు పోస్టుమాన్ డివిజన్ కార్యదర్శి బానోతు తిరుపతి నాయక్, ఏ సత్యం,ఎస్ హరీష్,జిడిఎస్ నాయకులు ఈ బి సతీష్, ఏం స్వామి, రాజేష్, శివాజీ, ఆపూర్వ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు చేస్తే ఉపేక్షించేదిలేదు...



*జమ్మికుంట, అక్టోబర్23, ప్రజాజ్యోతి :*

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న బోర్లను బుధవారం మున్సిపల్ అధికారులు తొలగించి సీల్ వేసారు. ఈ సందర్భంగా మున్సిపల్ టిపివో శ్రీధర్, ఏఈ నరేష్, టిపిఎస్ ప్రదీప్, మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ సదానందంలు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు, బోర్లను ఎవరు ఇష్టానుసారంగా ఏర్పాటు చేసుకున్న తొలగిస్తామని,అనుమతి లేకుండా నిర్మాణాలు,బోర్లు ఏర్పాటు చేస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని అన్నారు.. మున్సిపాలిటీ పరిధిలోని పద్మశాలివాడలో అక్రమంగా బోర్ ను వేసినట్లు సమాచారం రాగ దానిని తొలగించి, సీజ్ చేసారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోతే
# ప్రభుత్వం పై మిలిటెంట్ పోరాటాలే

**ఫీజు బకాయిల విడుదల చేయకుండా రేవంత్ రెడ్డి జాప్యం**

**విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం**

**ఫీజు బకాయిలు 2 రోజుల్లో విడుదల చేయకపోతే సచివాలయం ముట్టడే**

**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి**

*కరీంనగర్ బ్యూరో, ప్రజాజ్యోతి*





తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్,స్కాలర్షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్యం చేస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై మిలిటెంట్ పోరాటాలు చేస్తామని,రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం రావడానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు సహకారం ఉందన్న విషయం రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలని, ఫీజు బకాయిల విడుదల పై అనాడు రేవంత్ రెడ్డి చెప్పింది ఏంది నేడు చేస్తున్న జాప్యం ఏంటని ఫీజు బకాయిలను 27లోపు విడుదల చేయకపోతే చలో ఇందిరాపార్క్ నిర్వహిస్తామని వేలాది మంది విద్యార్థులతో హైదరాబాద్ దిగ్బంధనం చేస్తామని,సచివాలయం ముట్టడిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి హెచ్చరించారు.బుధవారం ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఛలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది విద్యార్థులు తెలంగాణ చౌక్ నుండి ర్యాలీగా కలెక్టరేట్ కి వెళ్లి అక్కడ గేటు ముందు బైఠాయించాడం జరిగింది. దాదాపు అర్థగంట సేపు నినాదాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది,ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత మూడు విద్యా సంవత్సరాల నుండి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిల విడుదల లేక విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఇబ్బందులు, సిబ్బందికి జీతాలు ఇవ్వలేక భవన కిరాయిలు చెల్లించలేక ప్రైవేట్ డిగ్రీ,పీజీ ఇంజనీరింగ్ ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూన్నాయని గత మూడు సంవత్సరాల నుండి ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నాలుగు రోజులు బంద్ చేసిన ప్రభుత్వం విడుదల చేయకుండా పెడచెవిన పెట్టడం సిగ్గు చేటనీ , గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తుంది అని మాట్లాడి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు మొత్తం ఒకే సారి విడుదల చేస్తామని చెప్పిన ఆనాటి పీసీసీ అధ్యక్షుడు , నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్న ఇప్పటికీ ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదని పాలకులు మారిన విద్యార్థుల జీవితాలు మారడం లేదని రాష్ట్రంలో విద్యాశాఖ కూడా తన వద్దే పెట్టుకున్న రేవంత్ రెడ్డి విద్యాశాఖకి నిధులు కేటాయించి విద్యార్థులకు ఖర్చు చేయడం లో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని, రాష్ట్రంలో అనేక రకాల ఖర్చులు చేస్తూ అనేక చెల్లింపులు చేస్తున్న ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయడంలో చేస్తున్న నిర్లక్ష్యం సరికాదని వెంటనే ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు టోకెన్ ఇచ్చినవి కాకుండా పెండింగ్ లో ఉన్న బకాయిలు మొత్తం ఒకే సారి విడుదల చేయాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫీజు బకాయిల విడుదల అయ్యే వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని చలో సచివాలయం నిర్వహిస్తామని మణికంఠరెడ్డి హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రామరాపు వెంకటేష్, మచ్చ రమేష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ మామిడిపల్లి హేమంత్,కేశబోయినా రాము,కనకం సాగర్, లద్దునూరి విష్ణు, నగర నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, కౌశిక్, ఛత్రపతి, వినయ్,శ్రావణ్,ఈశ్వర్,రిషి తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు యస్. జి.ఎఫ్ జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

*కరీంనగర్ బ్యూరో, ప్రజాజ్యోతి*



బ్యాడ్మింటన్ చాలా విశిష్టమైన క్రీడా అని,విలువైన క్రీడా అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా॥వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో ఏర్పాటు చేసినటువంటి విద్యార్థుల అభినందన సభకు ముఖ్య అతిధిగా హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడకు ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపుతో పాటు పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నారని చెప్పారు. ఈ క్రీడా ద్వారా ప్రత్యేకంగా శారీరక దేహదారుద్యాన్ని పెంపొందించుకోవచ్చని మరియు రోజువరి కార్యకలాపాలను ఎటువంటి అలసట లేకుండా చేసుకోగలుగుతామని చెప్పారు. ఈ క్రీడ పట్ల దృష్టిసారించడానికి పాఠశాలలోని అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పిస్తూ వివిధ స్థాయిలలో నిర్వహింపబడే పోటీలకు ఎంపిక చేసి చేయూతనిస్తున్నామని చెప్పారు.ఈ క్రమంలో ఇటీవల కాలంలో జిల్లా కేంద్రంలోని డా॥బి.ఆర్. అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించినటువంటి యస్. జి.ఎఫ్ పోటీలలో పాఠశాలకు చెందినటువంటి హర్షిత్, 9వ తరగతి, మీనకేతన్, 9వ తరగతి, ప్రసన్నకుమార్, 9వ తరగతి, రవి కార్తిక్, 9వ తరగతి, సుశాంత్, 10వ తరగతి లు అండర్ 17 బాలుర విభాగం, సంజన, 9వ తరగతి, హిరన్య, 10వ తగతి అండర్ 17 బాలికల విభాగం, తనీష్ రెడ్డి, 8వ తరగతి అండర్ 14 బాలుర విభాగం, మేఘన, 8వ తరగతి అండర్ 14 బాలికల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి త్వరలో నిర్వహించబోయే పోటీలలో పాల్గొనడం చాలా హర్షించదగ్గ విషయమని తెలుపుతూ విజేతలందరికి పుష్పగుచ్చాలతో పాటు అర్హత పత్రాలు అందజేసి చక్కని ప్రణాళికలను రూపొందిచుకొని అపూర్వ విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రెడ్డిలు అన్ని రంగాల్లో రాణించాలి..

**రెడ్డి ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పోటు మల్లారెడ్డికి రెడ్డిల ఘన సన్మానం..**

*చిగురుమామిడి, అక్టోబర్ 23, ప్రజాజ్యోతి*



రెడ్డి సంఘం సభ్యులు సామాజిక,రాజకీయ,ఆర్థిక రంగాల్లో రాణించాలని రెడ్డి ఐక్యవేదిక సంఘం మండల అధ్యక్షుడు కాటం సంపత్ రెడ్డి పిలుపునిచ్చారు.బుధవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన పోటు మల్లారెడ్డి రెడ్డి ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకం అయినా సందర్భంగా రెడ్డి ఐక్యవేదిక మండల సంఘం ఆధ్వర్యంలో అభినందన సభ సన్మాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.పోటు మల్లారెడ్డిని వారి గృహంలో మండలంలోని అన్ని గ్రామాల రెడ్డి సంఘం అధ్యక్షులు,సభ్యులు అందరు కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పోటు మల్లారెడ్డి మాట్లాడుతూ తనను గౌరవించి జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంపిక చేసిన జిల్లా సంఘానికి,మండలంలోని అన్ని గ్రామాల రెడ్డి సంఘాలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.రానున్న కాలంలో రెడ్ల పేదల పక్షాన ఉంటానని,వారికీ కావలసిన మౌలిక అవసరాల కోసం తన వంతు సహాయ సహకారాల అందిస్తానని చెప్పారు.సీఎం రేవంత్ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు రెడ్డిలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెడ్డి ఐక్యవేదిక మండల అధ్యక్షుడు కాటం సంపత్ రెడ్డి,జిల్లా నాయకులు కంది తిరుపతిరెడ్డి,శ్యామాకుర సంపత్ రెడ్డి, కాలువల రాజేశ్వర్ రెడ్డి,గునుకుల రాజేశ్వర్ రెడ్డి,పోటు సమ్మిరెడ్డి,వివిధ గ్రామాల రెడ్డి సంఘం అధ్యక్షులు పరిపాటి జయపాల్ రెడ్డి,పీచు తిరుపతి రెడ్డి,సింగిరెడ్డి స్వామిరెడ్డి, జంగా రాజి రెడ్డి,నల్లాల మధుసూదన్ రెడ్డి,కూతురు సంపత్ రెడ్డి,కర్ర అశోక్ రెడ్డి,కాటం సంజీవరెడ్డి,కాటం రవీందర్ రెడ్డి,నాగేల్లి రాజిరెడ్డి,వంగాల లక్ష్మారెడ్డి,సుధాకర్ రెడ్డి,రాజిరెడ్డి,పీచు మల్లారెడ్డి,తదిత

# రైతుల అంగీకారంతోనే పట్టా పాస్ పుస్తకాల జారీ





**– ఎంజాయ్మెంట్ సర్వే పై రైతులు తమ అభిప్రాయాలను తెలియజేయాలి**

**– రామగిరి మండల పర్యటనలో జిల్లా కలెక్టర్ కోయ. శ్రీహర్ష**

*రామగిరి, అక్టోబర్ 23, ప్రజాజ్యోతి*

రైతుల అంగీకారంతోనే పట్టా పాస్ బుక్ లా జారీకీ ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ.శ్రీహర్ష రైతులకు తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ.శ్రీహర్ష మండలంలోని రాజాపూర్, బుధవారం పేట గ్రామాలలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రెవెన్యూ రికార్డులు సరిచేయడానికి మండలంలోని బుధవారం పేట, రాజాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు 700 ఎకరాల ఎంజాయ్ మెంట్ సర్వే పూర్తి చేశామని, గ్రామంలో పూర్తి చేసిన ఎంజాయ్ మెంట్ సర్వే పై రైతులు ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నా దరఖాస్తు ద్వారా తెలియజేయాలని సూచించారు. రైతుల అంగీకారం తో సర్వే నివేదిక ప్రకారం పట్టాదారు పాసు పుస్తకాలు రైతులకు జారీ చేయుటకు గాను తహసీల్దార్, ఆర్.డి.ఓ.కు ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఇంచార్జి మంథని రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, రామగిరి మండల తహసిల్దార్ రాంచంద్రరావు, ఆర్ఐ నిహారిక, సీనియర్ అసిస్టెంట్ సంపత్, జూనియర్ అసిస్టెంట్ యస్వంత్, మాజీ ఎంపీపీ అరెళ్ళి దేవక్క కొమురయ్యా గౌడ్ అధిక సంఖ్యలో రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ




*కొడిమ్యాల, అక్టోబర్ 23, ప్రజాజ్యోతి*

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను పూర్తిస్థాయిలో మోసం చేశారని బిజెపి మండల అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్ రెడ్డి విమర్శించారు.మండల కేంద్రంలోని పార్టీ ఆఫీసులో బుధవారం రోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ సూపర్ సిక్స్ పేరిట తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చి కనీసం ఒక విషయంలో కూడా ఇచ్చిన హామీ నెరవేర్చక పూర్తిస్థాయి విఫలమైందని ఎద్దేవా చేశారు.స్థానిక సమస్యలపై అవగాహన ఉన్నదనే కారణంతోనే ప్రస్తుత ఎమ్మెల్యేకు ఇక్కడి ప్రజలు పట్టం కట్టడం జరిగిందని,ఇప్పటికైనా ఎమ్మెల్యే స్థానిక సమస్యలపై పూర్తి స్థాయిలో దృష్టిసారించాలని,మధ్యవర్తుల మాటలు నమ్మి పక్కదారి పట్టవద్దని,బీజేపీ పార్టీపై అనవసరపు ఆరోపణలు మానుకోవాలని అన్నారు.బిజెపి కార్యకర్తలు భగత్ సింగ్ వారసులని అధికార బలంతో మా కార్యకర్తలను భయపెట్టే ఉద్దేశం చేయవద్దని, మీ బెదిరింపులకు భయపడేవారు ఎవరు లేరని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఏలేటి నరసింహారెడ్డి,శ్రీనివాసరెడ్డి,అంకం పద్మ,బండ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభిమానుల అధ్వర్యంలో ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు



*జమ్మికుంట, అక్టోబర్ 23, ప్రజాజ్యోతి*

జమ్మికుంట పట్టణంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానుల అధ్వర్యంలో ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు స్థానిక మురళి థియేటర్ లో ఘనంగా నిర్వహించారు..హీరో ప్రభాస్ జన్మదినం పురస్కరించుకుని మిస్టర్ పర్ఫెక్ట్ సినిమా రీ రిలీజ్ అయిన సందర్భంగా బాణసంచాలు పేల్చి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షులు మాట్లాడుతూ మా అభిమాన హీరో జన్మదిన వేడుకలను ప్రభాస్ అభిమానుల నడుమ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా వారు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు..ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివాజీ, మండల ఉపాధ్యక్షుడు రాంప్రసాద్ రెడ్డి, ఇల్లందకుంట అధ్యక్షుడు అనిల్, రమేష్, సంపత్, లక్ష్మణ్, హరీష్, రవి, వంశీ, కిషోర్, వరుణ్, సుమన్, భాస్కర్, కౌశిక్ మరియు స్థానిక అభిమానులు తదితరులు పాల్గొన్నారు...

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**5గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..**



*చిగురుమామిడి, అక్టోబర్ 23, ప్రజాజ్యోతి*

రైతులు కష్టించి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని,ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే వరి పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని తహసిల్దార్ ముద్దసాని రమేష్,ఎంపీడీవో కాజా మొయినుద్దీన్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతి రెడ్డిలు తెలిపారు. మంగళవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం,పిచుపల్లి, లంబాడిపల్లె,గాగిరెడ్డిపల్లి,రేకొండ గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసిల్దార్ రమేష్,ఎంపీడీవో కాజా మొయినుద్దీన్ ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.కొనుగోలు సెంటర్ కు నాణ్యమైన వడ్లను తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు.ఏ గ్రేడ్ వరిధాన్యం ధర 2320,సాధారణ వడ్లకు 2300,సన్నవడ్లకు 500రూపాయలబోనస్ప్రభుత్వం అందిస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వరిధాన్యంకొనుగోలు కేంద్రాలవద్దరైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని నిర్వాకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, వ్యవసాయ శాఖ మండల అధికారి రమ్యశ్రీ,సింగిల్ విండో వైస్ చైర్మన్ కరివేద మహేందర్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి గీకురు రవీందర్,నాయకులు చిట్టుమల్ల రవీందర్,మాజీ ఎంపీటీసీలు చీల లక్ష్మారెడ్డి,రవీందర్ రెడ్డి,నాయకులు కలవల రాజేశ్వర్ రెడ్డి,కిష్టారెడ్డి,పీచు మల్లారెడ్డి,మంద శ్రీనివాస్,కుతుబుద్దీన్,పచ్చిమట్ల జగన్,గట్టు ప్రశాంత్,ఎండి రసూల్,బోయిని గణేష్,గ్రామపంచాయతీలో కార్యదర్శులు,రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన విద్యతోపాటు, పరిశుభ్రమైన పరిసరాలపై దృష్టి సారించండి

**– బేగంపేట ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**



*రామగిరి, అక్టోబర్ 23, ప్రజాజ్యోతి*

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతోపాటు, పరిశుభ్రమైన పరిసరాలపై దృష్టిసారించండనీ, మండలంలోని బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కోయ.శ్రీహర్ష బుధవారం చేసిన ఆకస్మిక తనిఖీలో ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో స్కావెంజర్ ఏర్పాటుపై ఆరా తీసి, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. మన ఊరు మన బడి కార్యక్రమం క్రింద నిర్మించిన డైనింగ్ హాల్ వినియోగించ కపోవడన్ని గమనించిన కలెక్టర్ అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్ లో ఫ్యాన్, విద్యుత్ సౌకర్యం కల్పనకు వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తనీఖీల్లో జిల్లా కలెక్టర్ వెంట పాఠశాల హెడ్మాస్టర్ ఎల్ .మేరీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జీఎం కమిటీలోకి ఎల్లంకి రామారావు

*రామగిరి, అక్టోబర్ 23, ప్రజాజ్యోతి*



ఆజ్ ట్రీ ఏరియాలో ఏర్పాటు చేసిన జీఎం కమిటీలోకి ఎల్లంకి రామారావు ఎంపికయ్యారు. ఏరియాలోని ఓసిపీ–2 లో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ఎల్లంకి రామారావు గడిచిన గుర్తింపు ఎన్నికల్లో ఆర్జి త్రీ ఏరియాలో ఐఎన్టీయూసీ గెలుపులో కీలకపాత్ర పోషించారు. తనపై ఉన్న నమ్మకంతో జీఎం కమిటీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, ఇందుకు అవకాశం కల్పించిన ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్ జనప్రసాద్ కి, ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## దహన సంస్కారాలకు పీఎంకే ఫౌండేషన్ చేయూత



*జమ్మికుంట, అక్టోబర్23, ప్రజాజ్యోతి:*

జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన ఉప్పుల రవి 35 సంవత్సరాలు బుధవారం అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న పీఎంకే ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్ గౌడ్ మృతుడు రవి కుటుంబానికి దహన సంస్కారాలకు 5000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పిఎంకె ఫౌండేషన్ నిర్వాహకుల ద్వారా అందించారు.. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు పల్లె రవి గౌడ్, గిరవేణ రాజయ్య యాదవ్, కడవెరుగు సంపత్, తాటిగంటి వీరస్వామి, తాటిగంటి ఐలయ్య, గిరవేన గణేష్, గండి రంజిత్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

# నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

**– మంథని సీఐ బి. రాజు**





**రామగిరి, అక్టోబర్ 23 (ప్రజాజ్యోతి):** నేరాల నియంత్రణకే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు మంథని సీఐ బి.రాజు తెలిపారు. రామగిరి, మంథని, ముత్తరం ఏస్సైలు చంద్ర కుమార్, డి. రమేష్, నరేష్ లతో కలిసి బుధవారం మండలంలోని కల్వచర్ల గ్రామంలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించి సరైన పత్రాలు లేనటువంటి ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటి పైన చాలాన్లు వేశారు. ఈసందర్భంగా గ్రామ ప్రజలతో ఏర్పటు చేసిన సమావేశంలో మంథని సిఐ బి.రాజు మాట్లాడుతూ.. గ్రామంలోని యువత గంజాయి, మత్తు పదార్థాల వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని వాటి వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. గంజాయి, మత్తు పదార్థాలు ఎవరైనా సేవించిన విక్రయించిన వారి వివరాలను పోలీసు వారికి చేరవేయాలని సూచించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, ఇచ్చిన వారు తల్లిదండ్రులైన కూడా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థిని విద్యార్థులు ఎటువంటి కేసుల్లో ఇరుక్కొని తమ భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దని సూచించారు. అంతేకాకుండా సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించి, తెలియని ఏదైనా ఫోన్ నెంబర్ నుండి కాల్స్ కానీ, మెసేజ్ కానీ వచ్చి మిమ్మల్ని ఏవైనా ప్రలోభాలకు గురి చేసిన వెంటనే మీరు 1930 నెంబర్ కు కాల్ చేసి పోలీసు వారి సహాయం పొందగలరని సూచించడం జరిగింది. సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ఎవరైనా అనుచిత పోస్టులు పెట్టిన అట్టి వారి పైన చట్టరీత్యా చర్యలు తీసుకుంటమని, గ్రామంలో అసాంఘిక చర్యలకు పాల్పడిన వారి పైన చట్టరీత్యా చర్యలు తీసుకోబడును అని వెల్లడించారు. మహిళలలు, పట్ల చిన్న పిల్లల పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. కళ్ళ ముందు జరిగే చెడు పనులపై బాధ్యతగా వ్యవహరించి, ఎటువంటి సమాచారం తెలిసిన తక్షణమే 100 నెంబర్ కు కాల్ చేసి పోలీస్ సహాయం తీసుకోవాలన్నారు.

## శ్రీ లోకమాత పోచమ్మ దేవి విగ్రహ ప్రతిష్ట



**ప్రజా జ్యోతి: జగిత్యాల్, అక్టోబర్ 23**

రాయికల్ మండలం కురుమ పల్లె గ్రామంలో శ్రీ లోకమాత పోచమ్మ దేవి విగ్రహ ప్రతిష్ట చేసి పూజా కార్యక్రమంలో పాల్గొన్న మేకల రాజమల్లు, తాటి గంగారెడ్డి, మల్లేశం, రాజమల్లు, ఆశాలు మల్లయ్య సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాలకూరతో పదిలాభాలు



ఆరోగ్యాన్ని ప్రసాదించడంలో 'పాలకూర'ది ప్రత్యేక స్థానం. ఆకు కూరల్లోనే.. ఇదో దివ్యౌషధం! శరీరానికి కావాల్సిన అన్నిరకాల విటమిన్లు, ఖనిజాలకూ ఇది నిలయం. అలాంటి పాలకూరను తినడం వల్ల కలిగే 'పది' అద్భుతమైన ప్రయోజనాలు ఇవి.

**ఐరన్ :** రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తిని పెంచడంలో ఐరన్ కీలకపాత్ర పోషిస్తుంది. 100 గ్రాముల పాలకూర తీసుకుంటే 2.7 మిల్లీ గ్రాముల ఐరన్ మన శరీరానికి లభిస్తుంది.

**కాల్షియం:** మహిళల్లో కాల్షియం లోపిస్తే.. ఎముకలు బలహీనంగా మారుతాయి. ఇక గర్భస్థ శిశువులో ఎముకలు, దంతాల ఎదుగుదలకు కాల్షియం అత్యవసరం. 100 గ్రాముల పాలకూర ద్వారా 99 మైక్రో గ్రాముల కాల్షియం దొరుకుతుంది.

**ఫైబర్ :** జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో ఫైబర్ కు సాటి ఏదీ లేదు. మలబద్ధకం సమస్యను తగ్గించడంలోనూ ముందుంటుంది. పాలకూరలో కేలరీలు తక్కువ, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. బరువు తగ్గాలనుకునేవారికి ఇది మంచి ఆహారం. 100 గ్రాముల పాలకూర తినడం ద్వారా 2.2 గ్రాముల ఫైబర్ మన శరీరానికి అందుతుంది.

**పొటాషియం:** శరీరంలో వివిధ జీవక్రియల నిర్వహణలో పొటాషియం పాత్ర ఎంతో కీలకం. రక్తపోటును అదుపులో ఉంచి, గుండె జబ్బులను నిరోధిస్తుంది. ముఖ్యంగా.. పోస్ట్ మెనోపాజ్ దశలో ఉన్న మహిళలకు ఇది అత్యవసర పోషకం. 100 గ్రాముల పాలకూరను తీసుకోవడం ద్వారా 558 మిల్లీ గ్రాముల పొటాషియం పొందవచ్చు.

**ఫోలెట్ :** పిల్లల కోసం ప్రయతిస్తున్నవారికీ, గర్భిణులకూ ఫోలెట్ ఎంతో అవసరమని వైద్యులు చెబుతున్నారు. గర్భస్థ పిండం ఎదుగుదలకు, అభివృద్ధికి అవసరమైన ముఖ్యమైన పోషకాలలో ఫోలెట్ కూడా ఒకటి. శిశువు మెదడు, వెన్నెముక అభివృద్ధిలోనూ ఇది కీలకంగా ఉంటుంది. 100 గ్రాముల పాలకూరలో 165 మైక్రో గ్రాముల ఫోలెట్ లభిస్తుంది.

**విటమిన్ ఎ:** కంటి చూపును మెరుగుపరచడం, చర్మాన్ని మెరిపించడంలో విటమిన్ ఎ కీలకం. జుట్టు పెరుగుదలకూ సాయపడుతుంది. కాబట్టి, అందాన్ని కాపాడుకోవాలంటే.. పాలకూరను ఆహారంలో భాగం చేసుకోవాల్సిందే! 100 గ్రాముల పాలకూరలో 141 మైక్రో గ్రాముల విటమిన్ ఎ అందుతుంది.

**విటమిన్ సి:** గొప్ప యాంటి ఆక్సిడెంట్ గా పనిచేసే విటమిన్ సి.. గాయాలను నయం చేయడంలో సాయపడుతుంది. అయితే, పాలకూరను ఎక్కువ సేపు మరిగిస్తే.. అందులోని విటమిన్ సి ఆవిరైపోతుంది. అందుకే, సలాడ్ రూపంలో తీసుకోవడం మంచిది. 100 గ్రాముల పాలకూర ద్వారా 28.1 మిల్లీ గ్రాముల విటమిన్ సి అందుతుంది.

**విటమిన్ కె :** వెన్నునొప్పి, జుట్టు రాలడం అతివలను ఎక్కువగా వేధించే సమస్యలు. వీటిని నివారించడంలో విటమిన్ కె.. ప్రధాన పాత్ర పోషిస్తుంది. 100 గ్రాముల పాలకూర ద్వారా 482.9 మైక్రో గ్రాముల విటమిన్ కె శరీరంలోకి చేరుతుంది.

**సోడియం:** కండరాలు, నాడీ వ్యవస్థ పనితీరు బాగుండాలంటే.. శరీరంలో కావాల్సినంత సోడియం ఉండాలి. శరీరంలో సోడియం తక్కువగా ఉంటే.. తీవ్రమైన తలనొప్పి, కండరాల బలహీనత వేధిస్తాయి. 100 గ్రాముల పాలకూరలో 79 మిల్లీగ్రాముల సోడియం ఉంటుంది.

**మెగ్నీషియం:** హార్మోన్ల నియంత్రణ మొదలుకొని ఎముకల ఆరోగ్యం వరకు అన్నిటినీ మెగ్నీషియం క్రమబద్ధీకరిస్తుంది. 100 గ్రాముల పాలకూర తీసుకోవడం ద్వారా 79 మైక్రో గ్రాముల మెగ్నీషియం లభిస్తుంది.

## ధర్మపీఠం అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



**రామగిరి, అక్టోబర్ 23 (ప్రజాజ్యోతి):** జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ధర్మపీఠం విశ్వ మానవ వికాస కేంద్రం ఆధ్వర్యంలో డిజిటల్, పత్రిక, ప్రింట్ మీడియా, సోషల్ మీడియా, యుట్యూబ్ రంగాల్లో విశేష కృషిచేస్తున్న జర్ణలిష్టులు, ఎడిటర్లకు అవార్డులు జిల్లాల వారిగా ఇవ్వనున్నట్లు కూచన మల్లయ్య మహర్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవీయ కోణంలో ఆలోచింపజేసే సమాజ ప్రయోజనాలే పరమావధిగా వార్త కథనాలు రాసి ప్రచురించిన, సోషల్ మీడియా యూట్యూబ్ లో ప్రసారం అయిన కథనాలకు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందిస్తామన్నారు. ధర్మపీఠం అవార్డులను తెలంగాణలోని ముప్పై మూడు జిల్లాల నుంచి ఒక్కొక్కరికి ఉత్తమ ప్రశంస పత్రం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎలాంటి ఫీజు లేదని ఆసక్తి కలవారు వారి వివరాలు 7095026350 వాట్స్ నంబర్ కు పంపించాలని, నేరుగా సంప్రదించవచ్చని సూచించారు.

## గ్రంథాలయ ఛైర్మన్ కు ఘన సన్మానం



**రామగిరి, అక్టోబర్ 23 (ప్రజాజ్యోతి):** పెద్దపెల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గా నియామకమైన అంతటి అన్నయ్య గౌడ్ ను సర్వాయి పాపన్న గీత కార్మిక గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పదవీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్వాయి పాపన్న గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోడూరి పరశురాములు గౌడ్, నాయకులు సింగం సత్తయ్య గౌడ్, గోపగాని సారయ్య గౌడ్, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు పడాల కొమురయ్య గౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్, గోపా జిల్లా అధ్యక్షుడు బాలసాని వెంకటేశం గౌడ్, కోల లక్ష్మణ్ గౌడ్, పాలకుర్తి మాజీ ఎంపీపీ గంగాధర్ రమేష్ గౌడ్, పొన్నం సత్తయ్య గౌడ్, పడాల వెంకటేశం గౌడ్, సుద్దాల సతీష్ గౌడ్, ఎరుకొండ చంద్రయ్య గౌడ్, కిరణ్ గౌడ్, బాలసాని అంజయ్య గౌడ్, సింగం కిరణ్ గౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు న్యాయం చేకూర్చాండి

**– మంత్రి శ్రీధర్ బాబు నీ కలిసి వినతిపత్రం అందించిన పోతారవెని క్రాంతి**



**రామగిరి, అక్టోబర్ 23 (ప్రజాజ్యోతి):** మంథని నియోజకవర్గం లోని ప్రతి ఒక్క మత్స్యకారునికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు పెద్దపల్లి జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ పోతరవేణి క్రాంతి కుమార్ వినతి పత్రం సమర్పించారు. హైదరాబాదు లోని సచివాలయంలో బుధవారం ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును కలిసి మంథని నియోజకవర్గంలో మత్స్యకారులకు జరుగుతున్న సమస్యలపై విన్నవించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూడాలని కోరగా మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించినట్లు క్రాంతి కుమార్ తెలిపారు.

## పోటు మల్లారెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

★ కాంగ్రెస్ నాయకులు అంచలంచలుగా ఎదగాలని పిలుపు

**చిగురుమామిడి అక్టోబర్ 23 (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన పోటు మల్లారెడ్డి రెడ్డి ఐక్యవేదిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకం అయిన సందర్భంగా మల్లారెడ్డిని కాంగ్రెస్ నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పిటిసి గీకురు రవీందర్, జిల్లా నాయకులు చిట్టుమల్ల రవీందర్ లు కాంగ్రెస్ పార్టీ తరపున శాలువాలు కప్పి ఘనంగా సన్మాంచారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ సంగంలో ఉన్న అంచెలాంచులుగా ఎదగాలని, అన్ని రంగాల్లో రాణిచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాటం సంపత్ రెడ్డి, గట్టు ప్రశాంత్, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి



**కొడిమ్యాల, అక్టోబర్ 23, (ప్రజాజ్యోతి ):**

ఎమ్మెల్యేని విమర్శించే స్థాయి రవీందర్ రెడ్డికి లేదని, అసత్య ఆరోపణలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలివేరి నారాయణ గౌడ్ హెచ్చరించాడు. మండల కేంద్రంలో బుధవారం రోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్ రెడ్డి వ్యవహార శైలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి కేవలం 10 నెలలే గడిచిందని తాము చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు చూసినా తర్వాత మాట్లాడాలని, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రాజకీయాలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ, నిత్యం ప్రజలలో మమేకమై అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది అని అన్నారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యేని విమర్శించే స్థాయి రవీందర్ రెడ్డికి లేదని ఇటువంటి వ్యాఖ్యలు ఎమ్మెల్యే పైన పునరావృతం జరిగితే పరిణామం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు చేసిన అసత్య ఆరోపణలకు బిజెపి మండల శాఖ అధ్యక్షుడు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ రాజు, శ్రీనివాస్, స్వామి, భూషణ్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో 25న ఛలో హైదరాబాద్

### సి.డి.యం.ఎ కార్యలయం ఎదుట ధర్నాకి పిలుపు

### మున్సిపాలిటీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె



**జమ్మికుంట, అక్టోబర్23, ప్రజాజ్యోతి:**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపాలిటీలలో సుమారు 65 వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ ఫిక్స్డ్ –పేడైలివేజ్ తదితర పద్ధతుల్లో పని చేస్తున్న కార్మికులు హైదరాబాద్ లోని సి.డి.యం.ఎ కార్యలయం ఎదుట ఈ నెల 25న ధర్నాకి పిలుపునివ్వగా జమ్మికుంట మున్సిపాలిటీ కార్మికులు కూడా ధర్నాలో పాల్గొననున్నట్లు మున్సిపల్ మేనేజర్ కి వినతి పత్రం అందించారు.. ఈ ధర్నా ముఖ్య ఉద్దేశం తెలుపుతూ సిబ్బంది పర్మినెంట్, కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లాంటి ప్రభుత్వ సంక్షేమాలు అమలు కావాలని, పనిచేస్తున్న సమయంలో ప్రమాదాలు జరిగి అనేక మంది కార్మికులు మరణిస్తున్నారని, వారికి ఎలాంటి నష్టపరిహారం చెల్లించడం లేదని, కార్మికులకు రక్షణ సదుపాయాలు కల్పించడం లేదని, మున్సిపల్ సిబ్బందినందరిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26,000/లుగా నిర్ణయించాలని, మున్సిపల్ కార్మికులకు 8 గంటల పని దినాలను అమలు చేయాలని, ప్రమాదాల్లో మరణిస్తున్న కార్మికులకు రూ.25 లక్షల ఇస్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలనే డిమాండ్ల పరిష్కారానికై తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో అక్టోబర్ 25న ఛలో హైదరాబాద్ సిడియంఎ కార్యలయం వద్ద ధర్నాలో డిమాండ్లను నెరవేర్చే విధంగా కార్యక్రమం ఉంటుందని వివరించారు.. ఈ కార్యక్రమంలో షరీఫ్, కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి

## జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

**ప్రజా జ్యోతి: జగిత్యాల్, అక్టోబర్ 23**



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు విద్యార్థులకు కార్పొరేట్ ప్రమాణాల స్థాయిలో నాణ్యమైన విద్యా బోధన అందించాలని జిల్లా కలెక్టర్ బి , సత్య ప్రసాద్ ఆదేశించారు. బుధవారం రోజున కోరుట్ల కాలనీలోని ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ బాయ్స్ & జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, తరగతి గదులను, పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాల తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో అన్ని వసతులు, సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంది అని ప్రశ్నించారు.. ఏ తరగతిలో ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆరా తీశారు. కిచెన్, స్టోర్ రూమ్ ను పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట, ఆర్డీవో, శ్రీనివాస్ , ఎస్సీ వెల్ఫేర్, రాజు కుమార్, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫేస్ బుక్ లో పరిచయం...

## పోలీస్ స్టేషన్ లో ఇద్దరిపై కేసు నమోదు






**జమ్మికుంట, అక్టోబర్ 23ప్రజాజ్యోతి :**

ఫేస్ బుక్ లో ఒక అమ్మాయి, అబ్బాయి పరిచయం కాస్త ఒకరి పై ఒకరు కేసు పెట్టుకునే విధంగా దారి తీసిన సంఘటన జమ్మికుంట పట్టణంలో చోటుచేసుకుంది.. జమ్మికుంట పట్టణ సిఐ వరగంటి రవి తెలిపిన వివరాల ప్రకారం జమ్మికుంటకు చెందిన కోడూరి రాజేష్ అనే వ్యక్తి కరీంనగర్ కు చెందిన ఒక మహిళ తో ఫేస్ బుక్ సోషల్ మీడియాలో పరిచయం కాగా కొన్ని రోజుల తరువాత డబ్బులు కావాలని డిమాండ్ చేసి ఇవ్వకుంటే నాపై రేప్ కేసు పెడతానని బెదిరింపులకు గురి చేయగా రాజేష్ జమ్మికుంట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పట్టణ సీఐ వరగంటి రవి తెలిపారు....కరీంనగర్ కు చెందిన ఒక మహిళ జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన రాజేష్ అనే యువకుడు తనకు పేస్ బుక్ ద్వారా పరిచయమయ్యాడని అప్పటినుండి ఇద్దరం తరచుగా కలుసుకునే వాళ్ళమని ఆ తర్వాత ఈ నెల 21వ తేదిన రాజేష్ నన్ను జమ్మికుంట రమ్మని కోరగా నేను మధ్యాహ్నం వరకు రాజేష్ వాళ్ళ ఇంటికి వచ్చేసరికి వాళ్ళ ఇంటిలో ఎవరు లేరని తెలుసుకొని నన్ను ఎందుకు రమ్మన్నావు అని అడగగా మా ఇంట్లో ఎవరూ లేరని పిలిచానని నాతో ఒక రోజు గడపాలని లేదంటే నిన్ను చంపుతానని బెదిరించినట్లు ఆ మహిళా భయపడి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సిఐ తెలిపారు. ఇరువురు వ్యక్తులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ వరగంటి రవి తెలిపారు..

# ఎమ్మెల్సీ ఓటర్ నమోదు పై అవగాహన సదస్సు

### ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పోకల నాగయ్య

**జమ్మికుంట, అక్టోబర్23, ప్రజాజ్యోతి :** రాబోయే పట్టభద్రుల ఎన్నికల ఓటర్ నమోదు జమ్మికుంట పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పోకల నాగయ్య హాజరయ్యారు.. వారు మాట్లాడుతూ 2021 సంవత్సరం ముందు డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి అర్హులని వారు తప్పకుండా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని ప్రతి ఒక్క పట్టభద్రుడు తన ఒక్క ఓటుతో ఏమవుతుందని ఆలోచించకుండా ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని తమ కుటుంబ సభ్యులు మిత్రులకు కూడా అవగాహన కల్పించి నమోదు ప్రక్రియలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.. గతంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేసినప్పటికీ ఇప్పుడు మరల ఓటు నమోదు చేసుకోవాలని గుర్తు చేశారు.. రాబోవు ఎలక్షన్ లో తనకి అవకాశం ఇస్తే ఉపాధ్యాయ అధ్యాపకుల తరపున ఉన్న సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపుతానని అన్నారు.. ఈ కార్యక్రమంలో గాయత్రి డిగ్రీ కళాశాల ఇంచార్జి మరబోయిన అంజిబాబు, చాణక్య డిగ్రీ కళాశాల ఇంచార్జి వంశీ, స్రవంతి జూనియర్ కళాశాల అధ్యాపకులు, విస్ డమ్ జూనియర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

